క్లుప్తంగా

హజ్ యాత్రికులకు సన్మానం



యాత్రికులను సన్మానిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని ఎంఐఎం పార్టీ కార్యాలయంలో ఆదివారం హజ్ యాత్రికులు మీర్ సాబిర్ అలి హఫీ్జ, మహ్మద్ హరున్ జుల్ఫఖర్‌లను ఆదివారం శాలువలు, పూలదండలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ అధ్యక్షుడు సల్మాన్‌ఖాన్ వారికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ కశిఫ్ హఫీ్జ, షేక్ ఆరీఫ్, మహ్మద్, సమీర్, సాయి, షాహబాజ్, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

సొంత ఖర్చులతో చేతిపంపు



భూమిపూజ చేస్తున్న ఎంపీపీ, ఆదివాసీలు

కెరమెరి: మండలంలోని నెహ్రూనగర్ ఆదివాసీ భవన్‌లో ఎంపీపీ పెందోర్ మోతిరాం తన సొంత ఖర్చులతో ఆదివారం చేతిపంపు వేశారు. కొన్నేళ్ల క్రితం నిర్మించిన ఆదివాసీ భవన్‌లో తాగునీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఆదివాసీలు ఎంపీపీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఆయన చేతిపంపు వేసి తన ఉదారత చాటుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సెడ్మకి దుర్పత బాయి, సార్మేడీలు ఆత్రం బొజ్జిరావు, మడపచి చిన్ను, కుమురం భీంరావు, దండు, మడావి రఘు, జగన్నాథ్‌రావు తదితరులు ఉన్నారు.

లెమన్ జ్యూస్ పంపిణీ

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసీఆర్ సేవాదళ్ ఆధ్వర్యంలో లెమన్ జ్యూస్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు శ్రీకాంత్, భీమ్‌రావు, అబ్దుల్ అకీబ్, ఇర్ఫాన్, ఆదిల్ పాల్గొన్నారు.

ప్రవీణ్‌కు సేవా పురస్కారం



పురస్కారం అందుకుంటున్న ప్రవీణ్

చింతలమానెపల్లి: ప్రజాసేవ పరమావధిగా కార్యక్రమాలను నిర్వహిస్తున్న లోడెల్లి ప్రవీణ్ కుమార్ ఉత్తమ సేవ పురస్కారానికి ఎంపిక య్యారు. ఈమేరకు ఆదివారం జిల్లా కేంద్రంలో జిల్లా కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఎస్పీ సురేశ్ కుమార్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యేలు కోనేరు కోనప్ప, ఆత్రం సక్కు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు, సురక్షా దివస్‌లో భాగంగా ఈ పురస్కారం అందజేశారు.

కల్వర్టు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి



పనులు పరిశీలిస్తున్న ఎంపీపీ మల్లిఖార్జున్

ఆసిఫాబాద్‌అర్బన్: మండలంలోని ఈదులవాడ గ్రామపంచాయతీ పరిధిలోని గొల్లగూడ గ్రామానికి వెళ్లే మార్గమధ్యంలో నూతనంగా నిర్మిస్తున్న కల్వర్టు పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంపీపీ మల్లిఖార్జున్ సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఆదివారం కల్వర్టు పనులను గ్రామస్తులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలం సమీపిస్తుండడంతో పనులను వేగవంతం చేయాలని, కల్వర్టు పనులు పూర్తయితే ఈదులవాడ, కొమ్ముగూడ, గొలగూడ గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుందన్నారు. వీరి వెంట సర్పంచ్ భీమేశ్, ప్రభాకర్, కోటేశ్వర్‌రావ్ తదితరులు ఉన్నారు.

11న విద్యార్థులకు సన్మానం

రెబ్బెన: జిల్లాలో ఇటీవల విడుదలైన పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ చూపిన ఆర్యవైశ్య విద్యార్థులకు జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు చక్రపాణి ఆదేశాల మేరకు ఈనెల 11న సన్మాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొలిపాక కిరణ్‌కుమార్ తెలిపారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఉదయం 9గంటలకు కాగజ్‌నగర్‌లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి శివ పంచాయతన క్షేత్రంలో విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. పదిలో 8 జీపీఏకు పైగా, ఇంటర్‌లో 800 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులు సన్మాన కార్యక్రమానికి అర్హులన్నారు. అర్హత కలిగిన ఆర్యవైశ్య విద్యార్థులు ఈనెల 7వ తేదీ లోగా రాజేంద్రప్రసాద్ 9440141520, తోట వినోద్‌కుమార్ 9490706080లను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

వ్యవసాయానికి కరెంట్ ఏది?

- ఏళ్లుగా కనెక్షన్‌ల కోసం పడిగాపులు
- రెండో పంటకు దూరమవుతున్న రైతులు



సిర్పూర్ (టి)లో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ లేక బీడుగా ఉన్న భూమి

సిర్పూర్(టి): వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్ల కోసం ఏళ్లుగా రైతులు పడిగాపులు కాస్తున్నారు. కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని సిర్పూర్(టి), కౌటాల, బెజ్జూర్, చింతలమానెపల్లి, పెంచికల్‌పేట్, దహెగాం, కాగజ్‌నగర్ మండలాల్లో వేలమంది రైతులు డీడీలు చెల్లించినా కనెక్షన్‌లు ఇవ్వడంలో అధికారులు జాప్యం చేస్తున్నారు. డివిజన్ పరిధిలోని సిర్పూర్(టి) మండలంలో 79 మంది రైతులు, కాగజ్‌నగర్ మండలంలో 107 మంది రైతులు, కౌటాల, చింతలమానెపల్లి మండలాల్లో 544 మంది రైతులు, దహెగాం మండలంలో 211 మంది రైతులు, బెజ్జూర్, పెంచికల్‌పేట్ మండలాల్లో 66మంది రైతులు మొత్తం 1007 మంది రైతులు వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్ల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. ఆసిఫాబాద్ డివిజన్ పరిధిలో సుమారు వెయ్యి మందికిపైగా రైతులు దరఖాస్తులు చేసుకున్నారు. సిర్పూర్(టి) మండలంలో నూతనంగా 57మంది రైతులు దరఖాస్తులు చేసుకోగా కొంతమంది రైతులు 2016 నుంచి విద్యుత్ కనెక్షన్‌ల కోసం పడిగాపులు పడుతున్నారు.

సిర్పూర్(టి) మండలంలో..

సిర్పూర్(టి) మండలం లక్ష్మీపూర్ గ్రామపంచాయతీ పరిధిలో బేతం లస్మయ్య అనే రైతు 2021లో కనెక్షన్ కోసం విద్యుత్తు శాఖకు రూ. 5వేలు డీడీ చెల్లించాడు. ఇతనితో పాటు లక్ష్మీపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో మరో నలుగురు 2021లోనే వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం డీడీలు చెల్లించారు. సిర్పూర్(టి) గ్రామపంచాయతీ పరిధి కొత్త కాలనీకి చెందిన వడ్డేటి నాగమణి 2016లో వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్ కోసం రూ. 5వేలు, రూ.1000, రూ. 500ల డీడీలు చెల్లించి కనెక్షన్ కోసం పడిగాపులు కాస్తున్నారు. డీడీలు చెల్లించినా టౌన్‌లైన్‌పై కనెక్షన్ ఇవ్వరాదని చెబుతూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతు వడ్డేటి నాగమణి వాపోతున్నారు. జిల్లాలోని ఆయా మండలాల్లో సైతం రైతులకు ఏదో ఒకసాకు చెబుతూ వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరుకు అధికారులు కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అవసరమున్న రైతులకు వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు సకాలంలో ఇవ్వకపోవడంతో రెండు పంటలు సాగు చేసుకోలేక తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి వెంటనే వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లు ఇచ్చి సహకరించాలని రైతులు కోరుతున్నారు.

2016లో డీడీలు చెల్లించా..



సిర్పూర్(టి) గ్రామపంచాయతీ పరిధి కొత్తకాలనీ సమీపంలో వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్ కోసం 2016లో డీడీలు చెల్లించా. కాని ఇంతవరకు కనెక్షన్ ఇవ్వలేదు. అధికారులను అడిగితే టౌన్‌లైన్‌పై వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్ ఇవ్వరాదంటున్నారు. గతంలో టౌన్‌లైన్‌పై ఇచ్చిన విద్యుత్తు కనెక్షన్లు కొనసాగుతున్నాయి. అధికారులు సమస్యను వెంటనే పరిష్కరించాలి.

– వడ్డేటి నాగమణి, సిర్పూర్(టి)

నిర్లక్ష్యం చేస్తున్నారు..



లక్ష్మీపూర్ గ్రామపంచాయతీ పరిధిలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం 2021లో విద్యుత్‌శాఖ పేరుతో డీడీలు చెల్లించాను. ఇప్పటివరకు కనెక్షన్ ఇవ్వకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. నా తర్వాత డీడీలు చెల్లించిన వారికి సైతం కనెక్షన్లు ఇచ్చారు. అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

– లస్మయ్య, లక్ష్మీపూర్

నిబంధనల మేరకే కనెక్షన్లు

వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌ల కోసం దరఖాస్తులు చేసుకున్న రైతులకు నిబంధనల మేరకే కనెక్షన్లు ఇస్తున్నాం. సిర్పూర్(టి) టౌన్‌లైన్‌పై గతంలో కనెక్షన్లు ఇచ్చారు. 2010 నుంచి టౌన్‌లైన్‌పై వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు ఇవ్వకూడదనే నిబంధనలు ఉన్నాయి. మండలంలో నూతనంగా దరఖాస్తులు చేసుకున్న 57 మందికి త్వరలోనే వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు ఇస్తాం.

– ఇర్ఫాన్, ఏఈ, సిర్పూర్(టి)

హరిత సంకల్పానికి సిద్ధం



దరోగపల్లిలో నర్సరీని పరిశీలిస్తున్న అధికారులు

- నర్సరీల్లో మొక్కల పెంపకం
- 2లక్షల మొక్కలు టార్గెట్
- పర్యవేక్షిస్తున్న అధికారులు

పెంచికల్‌పేట్: పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కల పెంపకానికి అధికారులు శ్రీకారం చుట్టారు. ఎనిమిదో విడత హరితహార కార్యక్రమానికి 2లక్షల మొక్కలు నాటడానికి ఉపాధిహామీ పథకంలో అధికారులు నర్సరీలను సిద్ధం చేశారు. పెంచికల్‌పేట్ మండలంలో 12 గ్రామపంచాయతీలు ఉండగా వాటిలో 12 నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కలు పెంచుతున్నారు.

సిద్ధమైన మొక్కలు..

మండలంలోని 12 పంచాయతీల్లో 2లక్షల మొక్కలను పెంచటానికి అధికారులు ఇప్పటికే ప్రణాళికలు తయారు చేశారు. గ్రామాల్లోని ఖాళీ ప్రదేశాలు, రోడ్డుకు ఇరువైపులా, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో మొక్కలు నాటడానికి అనువైన మొక్కలు పెంచుతున్నారు. టేకు, వేప, చింత, వెదురు, మునుగ, మామిడి, జామ, మందార, గులాబీతో పాటు అనేక రకాల పండ్ల మొక్కలు నాటనున్నారు.

పనులు వేగంగా సాగుతున్నాయి

మండలంలో 12 నర్సరీల్లో పనులు వేగంగా సాగుతున్నాయి. 2లక్షల మొక్కలను నాటడానికి లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం. నర్సరీల్లో మొక్కలను సంరక్షించటానికి షేడ్‌నెట్‌లను ఏర్పాటు చేశాం. వందశాతం మొక్కలను సంరక్షించటానికి నిత్యం సిబ్బందితో సమావేశాలను నిర్వహిస్తూ దిశానిర్దేశం చేస్తున్నాం.

– గంగాసింగ్, ఎంపీడీవో, పెంచికల్‌పేట్

నేడు విద్యుత్ విజయోత్సవం

రెబ్బెన: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం 4 గంటలకు కెరమెరిలోని స్టార్ ఫంక్షన్ హాల్‌లో విద్యుత్ విజయోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రెబ్బెన ఏఈ ఇమ్రాన్ తెలిపారు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు అనంతరం విద్యుత్ శాఖ సాధించిన ప్రగతిని వినియోగదారులకు వివరిస్తామన్నారు. మండలంలోని విద్యుత్ వినియోగదారులు, రైతులు తప్పకుండా కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

కౌటాలలో..

కౌటాల: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నేడు విద్యుత్ విజయోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు విద్యుత్‌శాఖ ఏడీఈ రాజేశ్వర్ ఆదివారం తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు కౌటాలలోని జగదాంబ గార్డెన్‌హాల్‌లో విజయోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. అనంతరం సిబ్బందితో సామూహిక భోజనాలు చేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ విజయోత్సవ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, సిర్పూర్(టి) నియోజకవర్గంలోని ఏడు మండలాల్లోని విద్యుత్ అధికారులు, సిబ్బంది సకాలంలో హాజరు కావాలని కోరారు.

ఇరుకురోడ్డుతో తప్పని తిప్పలు

- తరుచూ ప్రమాదాలు
- అక్రమంగా నడుస్తున్న భారీ వాహనాలు
- రెండు వరుసల రోడ్డు కలేనా?



సింగిల్ రోడ్డుపై నడుస్తున్న వాహనాలు

కెరమెరి: ఆర్‌అండ్‌బీ అధికారులు రెండు వరుసల రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని కెరమెరి ఘాట్‌లో విస్తరణ పనులు చేపట్టకపోవడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మండలంలోని కెస్లాగూడ గ్రామం నుంచి మొత్తం 9 కిలోమీటర్ల మేర ఘాట్‌రోడ్డు విస్తరించి ఉంది. 37 మూలమలుపులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఘాట్ రోడ్డు సింగిల్ రోడ్డు కావడంతో తరుచూ వాహనాలు బోల్తా కొడుతున్న సంఘటనలు జరుగుతున్నాయి.

ఆదిలాబాద్‌కు వెళ్లే మార్గం

ఆసిఫాబాద్ నుంచి ఆదిలాబాద్‌కు వెళ్లాలంటే ఈ ఘాట్‌రోడ్డు వెంటే వెళ్లాల్సి ఉంటుంది. దీంతో ఈ మార్గంలో ప్రతీరోజు ఆర్టీసీ బస్సులతో పాటు లారీలు, జీపులు, ఆటోలు, ద్విచక్రవాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. 50 ఏళ్ల నుంచి రోడ్డు విస్తరణ చేపట్టకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రిజర్వు ఫారెస్ట్ ప్రాంతం కావడంతో అటవీ అధికారులు రెండు వరుసల రోడ్డు నిర్మాణానికి అనుమతి ఇవ్వడం లేదు.

భారీ వాహనాలతో ఇబ్బందులు

వాస్తవంగా ఈ రోడ్డుపై పది టైర్ల వాహనాలతో పాటు భారీ వాహనాలు వెళ్లేందుకు అనుమతి లేదు. కాని ఈ మార్గంలో ఎలాంటి టోల్‌ప్లాజాలు లేకపోవడంతో భారీ వాహనాలు అక్రమంగా రాకపోకలు సాగిస్తున్నాయి. అయినా అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. కాగా అనేక ప్రాంతాల్లో డివైడర్లు కూడా లేకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్తాం



సింగిల్ రోడ్డు ఉండడంతో తరుచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఘాట్‌రోడ్డుపై డబుల్ రోడ్డు వేయాలని గతంలోనే అధికారులకు విన్నవించాం. రోడ్డు రిజర్వు ఫారెస్టులో ఉందని క్లియరెన్సు లేదని చెబుతున్నారు. డబుల్ రోడ్డు నిర్మాణానికి ప్రయత్నిస్తాం.

– పెందోర్ మోతీరాం, ఎంపీపీ, కెరమెరి

కౌటాలలో గాలి దుమారం

కౌటాల: మండలంలో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులు వీచాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఆకాశంలో కారు మబ్బులు కమ్ముకోవడంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వ ఉన్న రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రైవేట్ పాఠశాలలను తనిఖీ చేయాలి

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడిపిస్తున్న ప్రైవేట్ పాఠశాలలను సీజ్ చేయాలని విద్యార్థి జనసమితి జిల్లా అధ్యక్షుడు బచ్చలి ప్రవీణ్‌కుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రైవేట్ పాఠశాలలను తనిఖీ చేసి, విరుద్ధంగా నడిపించే పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో విద్యార్థిసంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

బహిరంగ సభ విజయవంతం చేయండి

ఇంద్రవెల్లి: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదానంలో ఈనెల 6న నిర్వహించే బహిరగ సభను విజయవంతం చేయాలని రమాయి మహిళా మండలి జిల్లా అధ్యక్షురాలు తులజాపూరే శోభాబాయి కోరారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో ఆదివారం ఆమె మాట్లాడారు. ముఖ్యఅతిథిగా బీఆర్ అంబేద్కర్ మనుమడు ప్రకాశ్ అంబేద్కర్ హాజరవుతారని పేర్కొన్నారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు. అనంతరం అంబేద్కర్ మెమోరియాల్ అసోసియేషన్ నాయకులతో కలిసి సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అసోసియేషన్ మండల అధ్యక్షుడు సోన్ కాంబ్లే మనోహర్, ఉపాధ్యక్షుడు పవార్ శివాజీ, ప్రధాన కార్యదర్శి కాంరాజ్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

నెన్నెల: మండలంలోని మైలారం గ్రామానికి చెందిన జక్కుల అశోక్‌గౌడ్, పుష్పలత దంపతుల కూతురు అక్షిత వివాహం ఈ నెల 8న జరగనుంది. నిరుపేద కుటుంబం కావడంతో దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నారు. విషయం తెలుసుకున్న బొమ్మెన కుటుంబ సభ్యులు బొమ్మెన శ్రీమతి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు, గొల్లపల్లి ఎంపీటీసీ హరీష్‌గౌడ్, సత్యనారాయణగౌడ్ యువతి తల్లిదండ్రులకు ఆదివారం రూ.25వేల నగదు ఆర్థిక సాయం అందించారు.

భక్తిశ్రద్ధలతో వటసావిత్రి పౌర్ణమి పూజలు



బాలాజీ అనుకోడలో పూజలు చేస్తున్న మహిళలు



రెబ్బెన: అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

చింతలమానెపల్లి: మండలంలో ఆదివారం వటసావిత్రి పౌర్ణమి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు వట వృక్షాన్ని దేవతా వృక్షంగా భావించి పూజలు చేస్తారు. మండంలోని బాబాపూర్, బాలాజీ అనుకోడ గ్రామాలలో మహిళలు మర్రి, రావి చెట్లకు దారం చుట్టి పూజలు నిర్వహించారు. మర్రి చెట్టును త్రిమూర్తుల స్వరూపంగా భావించి మొక్కులు తీర్చి వ్రతం పూర్తి చేసుకున్నారు. గాజులు, కుంకుమ, పూలు సమర్పించారు.

రెబ్బెనలో..

రెబ్బెన: ఇందిరానగర్‌లోని కనకదుర్గాదేవి, స్వయంభూ మహంకాళి అమ్మవారి ఆలయంలో ఆదివారం వటసావిత్రి వ్రతాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ఆలయం ఆవరణలో రావి చెట్టుకు పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. అమ్మవార్లకు నవధాన్యాలు, పట్టువస్త్రాలు, నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి ఆలయానికి వచ్చిన భక్తులకు ఆలయ ప్రధాన అర్చకులు దేవార వినోద్ తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి



మాట్లాడుతున్న కేశవరావు

కెరమెరి(ఆసిఫాబాద్): ఎస్సీ వర్గీకరణకు ప్రభుత్వం చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి రేగుంట కేశవరావు అన్నారు. మండల కేంద్రంలో శనివా రం రాత్రి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 28 ఏళ్లుగా ఉద్యమం చేస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక విధంగా, అధికారంలోకి వ చ్చిన తర్వాత మరోలా మాట్లాడుతూ సమస్యను పక్కదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నెల 6న ఆసిఫాబాద్ పట్టణంలో నిర్వహించే సభకు మందకృష్ణ మాదిగ హాజరవుతారని తెలిపారు. ఈ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పార్ల వెంకటేశ్, కంబాల వినేష్, కంబాల లక్ష్మి, రామిళ్ల లలిత, గోగర్ల రాజయ్య, రాంచందర్, శంకర్, చంద్రశేఖర్, నరేశ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం

పాతమంచిర్యాల: విద్యార్థులు లక్ష్యం ఎంచుకుని భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని మితఅయ్యల్వార్ కుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి అన్నారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్లో ఆదివారం మితఅయ్యల్వార్ కమ్యూనిటీకి చెందిన ఇంటర్, టెన్త్ పరీక్షల్లో ప్రతిభ చూపిన 15మంది విద్యార్థులను శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సాత్పడి విజయ్, ఉపాధ్యక్షుడు గడ్డల మధుసూధన్, కోశాధికారి మార్కాపురి రమేష్, గౌరవ అధ్యక్షుడు దర్మపురి నర్సయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

6న జిల్లాకు మందకృష్ణ

ఇచ్చోడ: కుమురం భీం జిల్లాలో ఈనెల 6న ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే సమావేశానికి వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ హాజరవుతారని జిల్లా అధ్యక్షుడు అరెల్లి మల్లేశ్ తెలిపారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సమావేశంలో వర్గీకరణ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేలా కార్యచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు హాజరుకావాలని కోరారు. మహాజన్ సోషల్ పార్టీ నాయకుడు సుభాష్, జిల్లా నాయకుడు భూమయ్య, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రవి, నాయకులు పాల్గొన్నారు.

సింగరేణి సంబురాలకు ఏర్పాట్లు



ప్రత్యేక ఆకర్షణగా వాటర్ ఫౌంటేన్



మైదానంలో సింగరేణి తల్లి విగ్రహం

రెబ్బెన: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించనున్న సింగరేణి సంబురాలకు గోలేటి టౌన్‌షిప్‌లోని భీమన్న స్టేడియం ముస్తాబైంది. సోమవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వేడుకలు నిర్వహించేందుకు ఏరియా జనరల్ మేనేజర్ దేవేందర్ ఆదేశాల మేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. రెండు రోజులుగా అన్ని విభాగాల అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. మైదానంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచేలా వాటర్ ఫౌంటేన్‌తోపాటు సింగరేణి తల్లి విగ్రహం ఏర్పాటు చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, పదేళ్లలో సింగరేణి సంస్థ సాధించిన ప్రగతి తెలిపేలా స్టాల్స్ ఏర్పాటు చేశారు. బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి, మాదారం టౌన్‌షిప్ ప్రాంతాల నుంచి హాజరయ్యే సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల కోసం టెంట్లు, కుర్చీలు సిద్ధం చేసి, మైదానాన్ని ముస్తాబు చేశారు. జీఎం కార్యాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన



నిరసన తెలుపుతున్న తుడుందెబ్బ నాయకులు

తిర్యాణి: మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తుడుందెబ్బ సంఘం నాయకులు ఆదివారం మండల కేంద్రంలోని కుమురంభీం చౌరస్తా వద్ద నిరసన వ్యక్తం చేశారు. సంఘం డివిజన్ అధ్యక్షుడు వెద్మ భగవంత్‌రావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సాధించి దశాబ్ద కాలం గడుస్తున్నా మండలంలో నెలకొన్న సమస్యలు మాత్రం పరిష్కరించడం లేదన్నారు. అన్ని గ్రామాలకు మెరుగైన రోడ్ల నిర్మాణం చేపట్టడంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు తోడసం భాస్కర్, డివిజన్ ఉపాధ్యక్షుడు గెడం సుభాష్, నాయకులు బారిక్‌రావు, కోట్నాక ప్రవీణ్, గణపతి తదితరులు ఉన్నారు.

వర్షాలు కురవాలని పూజలు

ఆదిలాబాద్: వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుతూ జిల్లా కేంద్రంలోని కైలాస నగర్ కాలనీలో పోచమ్మ ఆలయంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసిని రెడ్డి స్థానిక మహిళలు, యువతులతో కలిసి ఆదివారం పూజలు నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు బాగా పండాలని మొక్కుకున్నారు.

ఎస్పీ బాలసుబ్రమణ్యం జయంతి

ఎదులాపురం: నేపథ్య సంగీత దర్శకుడు, గాయకుడు ఎస్పీ బాలసుబ్రమణ్యం 77వ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఖానాపూర్ కాలనీకి చెందిన కొత్తూరు లింగయ్య ఆయన ఫ్లెక్సీ చిత్రానికి పూల మాల వేసి అంజలి ఘటించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఆకాశవాణి సీనియర్ అనౌన్సర్స్ రాజవర్ధన్, అశోక్, చిత్ర కళాకారులు కవిత, పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కొమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా:
9010608462
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
కొమురంభీం ఆసిఫాబాద్ :
తిరుపతి, ACO - 7997958206
సిర్పూర్ కాగజ్‌నగర్ : కె.సాయికుమార్, S.R. - 7672055661
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899